క్లుప్తంగా

అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

శంకర్‌పల్లి: అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలోని సుబీషీ సంస్థ యజమాని వేణుగోపాల్ రెడ్డి అయ్యప్ప దేవాలయం నిర్మాణంలో భాగంగా రూ.10లక్షలను దేవాలయం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప దేవాలయం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మిర్యాల శ్రీనివాస్, దండు మోహన్, విశ్వేశ్వర్, జంగయ్య, శ్రీనివాస్, పాండు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కేశంపేట సర్పంచ్ వెంకట్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కేశంపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లను పరిశీలిస్తుండాలన్నారు. పదవ తరగతిలో ఉన్నత మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులను కోరారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కొనసాగించాలి

సబితారెడ్డిని కలిసిన దామరగిద్ద గ్రామస్తులు



మంత్రి సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని దామరగిద్ద గ్రామంలో ఉన్న హిందూ శ్మశానవాటికను ఏళ్ల తరబడిగా కొనసాగిస్తున్నామని దీనిని అలాగే కొనసాగించేలా చూడాలని మంత్రి సబితారెడ్డిని నగరంలోని ఆమె నివాసంలో కలిసి దామరగిద్ద గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్మశానవాటిక సమస్యను వివరించారు. 1954లకు ముందు నుంచే గ్రామంలోని సర్వే నెంబర్ 54లో ప్రభుత్వం స్మశానవాటికకు కేటాయించినట్లుగా రికార్డు ఉందని చెప్పారు. అప్పటి నుంచి కూడా ఈ శ్మశానవాటికలోనే గ్రామస్తులు అంత్యక్రియలను కొనసాగిస్తూ వస్తున్నారని చెప్పా రు. అప్పట్లో ఈ సర్వేనంబర్‌లో ఎలాంటి ఇళ్లు లేవని అన్నారు. ఆ తరువాత కాలంలో కొంత మంది ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకున్నారని తెలిపారు. కావాలని కొంత మంది ఈ శ్మశానవాటికను తొలగించాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.స్పందించిన మంత్రి సబితారెడ్డి ఈ చిన్న విషయాన్ని ఎందుకు పెద్దగా చేసుకుంటున్నారని ఆర్డీఓ, తహసీల్దార్లకు ఫోన్‌చేసి దామరగిద్దలో శ్మశాన వాటిక విషయాన్ని పరిశీలించి ప్రజలకు సరైన న్యాయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

చదువుల్లో రాణించాలి

సీఐ నవీన్‌కుమార్

షాద్‌నగర్: విద్యార్థులు చిన్న నాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి చదువుల్లో రాణించాలని షాద్‌నగర్ పట్టణ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీకాకతీయ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం సీఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు అంతా విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకోవాలని, లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. కృషి పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఉండదన్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. పరీక్షలంటే భయం వీడి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ స్వాతిరెడ్డి, డైరెక్టర్ దత్తు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఏమైంది?

- ఎమ్మెల్యే కాలె యాదయ్యను అడ్డుకున్న గ్రామస్తులు
- టంగటూరు–మోకిల గ్రామాల మధ్య మూసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్



ఎమ్మెల్యే కాలె యాదయ్యను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు, యువకులు

శంకర్‌పల్లి: మండలంలోని టంగటూరు గ్రామానికి కబడ్డీ పోటీల పారంభోత్సవానికి శనివారం విచ్చేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్యను గ్రామస్తులు, యువకులు అడ్డుకున్నారు. టంగటూరు–మోకిల గ్రామాల మధ్య మూసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. మూసీవాగుపై బ్రిడ్జి లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం లక్షలు వెచ్చించి పైపులు వేసుకోవడంతో పాటు మట్టిని పోసుకుంటున్నామని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే కాలె యాదయ్య బ్రిడ్జి నిర్మాణ పనులకు మంజూరు పత్రం వచ్చిందని ప్రస్తుతం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో శంకుస్థాపన చేయలేకపోతున్నామని సమాధానం ఇచ్చారు. ఆగ్రహానికి లోనైనా గ్రామస్తులు.. గత ఎన్నికల సమయంలో కూడా ఎన్నికల కోడ్ కారణం చెప్పావు. మళ్లీ అదే చెబుతున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వస్తే మంజూరు పత్రం తమకు చూయించాలని మొరాయించారు. బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే కచ్చితంగా బ్రిడ్జిని నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనక్కి తగ్గారు. అనంతరం టంగటూరు గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి, యువకులతో కలిసి కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో యువకుల్లో స్నేహభావాలు పెంపొందుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునేందుకు సీఎం కేసీఆర్ చొరవతో అన్ని హంగులతో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో టంగటూరు సర్పంచ్ గోపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, జెడ్పీటీసీ గోవిందమ్మ, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్‌రెడ్డి, మండల టీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్, మండల యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మున్సిపల్ పరిధిలోని రామంతపురంలో జరుగుతున్న ఊరడమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేరి అనంత్‌రెడ్డి తల్లి పద్మమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొందుర్గు: ఉపాధ్యాయులందరు మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ కోరారు. శనివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ పాఠశాలలను సందర్శించి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. గత ఎనిమిది సంవత్సరాలుగా పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు లేక ఎన్నో సమస్యలతో తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థ బాగుపడాలంటే మాణిక్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు వెంకటయ్య, శివారెడ్డి, టిలీశ్వరయ్య, యాదగిరి, మాజీద్, శేఖర్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నమో మాతృమూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు బాలింతలు, గర్భిణులకు ప్రోటీన్, విటమిన్ పౌడర్లతో పాటు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మగౌడ్, నాగరాజుచారి, రాఘవులు, ప్రభాకర్‌చారి, సుధాకర్‌రెడ్డి, రణధీర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



రావిర్యాలలో ఓ రైతుతో మాట్లాడుతున్న శంకర్

కొందుర్గు: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల, వీరసముద్రం గ్రామాల్లో వారు పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రైతులకు రుణమాఫీ వంటి హామీల అమలు మరిచిపోయిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలిరాజు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాల్‌రాజ్, శివకుమార్, సలీమ్, భాస్కర్, చంద్రశేఖర్, సత్యనారాయణ రెడ్డి, రజిత పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

- సమావేశాలకు గైర్హాజరు సరికాదు
- మండల సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సర్పంచులు, ఎంపీటీసీలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పలు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను మార్చడం..వేలాడే తీగలను సరిచేయడానికి వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాత జాతీయ రహదారి విస్తరణ కారణంగా ధ్వంసమైన మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు పనులకు రూ.10 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

సమావేశాలకు గైర్హాజరు సరికాదు..

ప్రతి మూడునెలలకోసారి గ్రామాల అభివృద్ధిపై నిర్వహించే మండల సమావేశం సర్పంచులు, ఎంపీటీసీలకు ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు. సమావేశాలకు సమాచారం అందగానే రావాల్సిన బాధ్యత వారికి ఉందన్నారు. కాగా, సమావేశాలకు వరుసగా ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం సరికాదని ఎమ్మెల్యే వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు గైర్హాజరైతే పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తారు.. వారి సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారని అసహనం వ్యక్తం చేశారు. సర్పంచులు గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయ రాబడి మార్గాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీలకు అనుబంధంగా ఉన్న గ్రామాల్లోనే రేషన్ సరుకులు పంపిణీ చేసే విధంగా సర్పంచులు, అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఎస్‌బీపల్లి సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అనాధికారికంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయం అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాములు, ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు, వైస్ ఎంపీపీ శోభా, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ నాయకుడు నర్సింహయాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న నర్సింహయాదవ్

కేశంపేట: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గ్యాస్ పైన కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని ఎందుకు తగ్గించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్యాస్ పైన సబ్సిడీని తగ్గించుకొని తక్కువ ధరకే సిలిండర్‌లను ఇవ్వాలన్నారు. గ్యాస్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే తక్కువ ధరకే సిలిండర్‌లను అందించవచ్చని భావించిన కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కరెంట్, బస్సు చార్జీలు, ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచుతూ పోతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బైకని శేఖర్, పారేష, భక్తవత్సాల్, కుమార్, నరేందర్‌రెడ్డి, తిరుపతి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

డాక్టర్ రమేష్ అల్లూరి



రమేష్ అల్లూరిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

మొయినాబాద్‌రూరల్: ఫార్మసీ విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ నర్సాపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ అల్లూరి అన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో గల చిలుకూరు బాలాజీ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్లు టి.రమేష్‌బాబు, ఎం.నర్సింహ్మారెడ్డి, ఎం.మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ జాతీయస్థాయి సెమినార్‌లో పలు రాష్ట్రాల్లోని ఆయా ఫార్మసీ కళాశాలల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిధిగా డాక్టర్ రమేష్ అల్లూరి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఫార్మసీ రంగం ఎంతో కీలకమైందన్నారు. కరోనా సమయంలో ఫార్మసిస్టులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఫార్మా రంగంలో హైదరాబాద్ ప్రపంచంలోనే తలమానికమని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరరావు, డైరెక్టర్ రమేష్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

నాయకులు భీంభరత్, విజయ్



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

షాబాద్: చందనవెల్లి భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ వెనక్కి తగ్గేది లేదని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హైతాబాద్ చౌరస్తాలో చందనవెల్లి, హైతాబాద్, మాచన్‌పల్లి టీఎస్ఐఐసీ ఇండస్ట్రియల్‌లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులతో అఖిలపక్షం నాయకులు కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి విజయ్ ఆర్య క్షత్రియ, సీపీఐ నాయకులు రామస్వామి, భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చందనవెల్లి భూనిర్వాసితులకు కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. భూసేకరణలో అక్రమాలకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు అందాల్సిన డబ్బుల కోసం గత 180 రోజులుగా దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తే అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టారన్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, బీఎస్పీ మండల అధ్యక్షులు వెంకటేష్, భూనిర్వాసితులు అనంతం, శోభ తదితరులున్నారు.

రైతులు సంఘటితం కావాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, పెంటయ్య

షాబాద్: రైతులందరూ పార్టీలకు అతీతంగా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, పెంటయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కిసాన్ సంఘ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులందరూ పార్టీలకు అతీతంగా సంఘటితం కావాలన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలు వస్తే 18004253600కు ఫిర్యాదు చేయాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి సంఘం ఎంతో పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు శేఖర్, కుమార్, బాల్‌రాజ్, అంజయ్య, కృష్ణ, అంతయ్య, హనుమంతు, రైతులు ఎట్టయ్య, కిష్టయ్య తదితరులున్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాబాద్: జీవితంలో మనిషిని ఉన్నతస్థాయికి చేరేందుకు దోహదపడేది చదువేనని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కుర్వగూడ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, ఫ్యాషన్‌షో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, జిజ్ఞాస, సన్మార్గంలో పయనించే విద్యను ప్రతి ఒక్కరూ నేర్చుకున్నప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. విద్యను కష్టంగా భావించకూడదని, ఇష్టంగా చదివితే అద్భుతాలు సృష్టిస్తారని సూచించారు. సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ వనిత మాట్లాడుతూ...విద్యార్థులు ప్రణాళికతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో కుర్వగూడ, సర్దార్‌నగర్ హెచ్‌ఎంలు ధనలక్ష్మీ, జంగయ్య, పాఠశాల చైర్మన్ శివకుమార్, గ్రామస్తులు తదితరులున్నారు.

చేవెళ్ల కోర్టు కాంప్లెక్స్ బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

చేవెళ్ల: చేవెళ్ల కోర్టు కాంప్లెక్స్ బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సీనియర్ న్యాయవాది రవి శంకర్‌గౌడ్ అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ 2023– 24 ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎంపికైన నూతన కమిటీని ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా చేవెళ్ల కోర్టు కాంప్లెక్స్‌కు సంబంధించి న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా జి. శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా బి. మల్లేశ్‌గౌడ్, ట్రెజరరీగా బి. శ్రీనివాస్, లైబ్రరీయన్ కె. యాదగిరిగౌడ్, స్పోర్ట్స్ కార్యదర్శిగా పి.మల్లేశం, మహిళావిభాగం ప్రతినిధిగా పి.రోజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా అమర్‌నాథ్ రెడ్డి, ఎస్. ఈశ్వర్, ఎం. గోపాల్, షరీఫ్, పి. రాజశేఖర్, ఎన్నికైనట్లు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు..

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి మాణిక్యరావు థాక్రే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, వీరేందర్, మాణయ్యలతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడోయాత్ర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు కృషి చేయాలన్నారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధించే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నియంతపాలన సాగుతుందని, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికి సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు.

ఆధునిక రంగాలపై దృష్టి సారించాలి

హైదరాబాద్ సీపీ సీవీ.ఆనంద్



గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న సీవీ ఆనంద్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు ఆధునిక రంగాలపై దృష్టిసారించి మంచి పరిశోధనలు చేపట్టాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి పీఆర్‌ఈఎస్‌ఎన్‌డీఓ–2023 పేరిట ఫెస్ట్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీవీ ఆనంద్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన విధానాలపై అధ్యాయానికి శ్రద్ధ చూపాలని తెలిపారు. ఉన్నత విద్యలో మంచి మార్గాలను ఎంచుకొని ముందుకు వెళ్లాలన్నారు. అధ్యాపకుల సూచనలను పాటించాలన్నారు. ఇంజనీరింగ్ విద్య నాలుగు సంవత్సరాలే కానీ జీవితంలో ఎన్నో గుణపాఠాలు నేర్పిస్తుందని చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మీ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు నిర్దేశించారు. గత కొన్ని సంవత్సరాలుగా తమ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు మంచి పునాదులు వేస్తున్నామని కళాశాల చైర్మన్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థులకు మంచి ఉద్యోగ కోసం ప్లేస్‌మెంట్స్ కూడా వివిధ కంపెనీల ద్వారా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం గోల్డ్ మెడల్ పొందిన విద్యార్థులకు సీవీ.ఆనంద్ గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సినీ హీరో ఈశ్వర్, కళాశాల డైరెక్టర్ సాయిబాబా, ప్రిన్సిపాల్ పద్మజ, ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీనివాస్, ఏఓ వెంకటాచలం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలి

జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు



ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

చేవెళ్ల: ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌ను వెంటనే గద్దె దించాలని కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల నియోజకవర్గం నాయకులు ఎస్. వసంతం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఉద్యోగులు చింపుల సత్యనారాయణరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని న్యాలట గ్రామంలో శనివారం కాంగ్రెస్‌పార్టీ హాత్ సే హాత్ జోడో పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్‌పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మంచి రోజులు వస్తాయని చెప్పారు. బీఆర్‌ఎస్‌పార్టీ ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందన్నారు. గతంలో గ్రామాల్లో ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాయంటే అది ఒక్క కాంగ్రెస్ హయాంలోనేనని తెలిపారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం చేశామని చెప్పుకుంటున్న అన్ని కూడా కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసినవేనని చెప్పారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాపార్టీ నాయకులు మధుసూదన్‌గుప్తా, యాలాల మహేశ్వర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గం కార్యదర్శి సుశాంత్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.